క్లుప్తంగా

ఘనంగా రెవెన్యూ డే వేడుకలు



ముప్పాళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా రెవెన్యూ శాఖ ద్వారా అందించే సేవలను తహసీల్దార్ కె.నగేష్ వివరించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామాల్లో మెరుగైన రెవెన్యూ సేవలందించిన నార్నెపాడు, గోళ్ళపాడు గ్రామాలకు చెందిన సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆయా గ్రామాల రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో యోగా

సత్తెనపల్లి: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం 6 గంటలకు యోగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ శుక్రవారం తెలిపారు. పట్టణ ప్రజలు, ఎన్జీవోలు, ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘ గ్రూపు సభ్యులు, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



సత్తెనపల్లి: పట్టణంలోని రఘురాం నగర్‌లో గల ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రజలు తన దృష్టికి పలు సమస్యలు తీసుకు వచ్చారని, తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశానన్నారు. అందరి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మెప్మా ఆర్పీలు 33 మందికి గాలక్సీ ఏ9+ ట్యాబ్స్, 25 మందికి ఫింగర్ స్కానర్‌లు శుక్రవారం పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్, నాయకులు యెల్లినేడి రామస్వామి, దరువూరి నాగేశ్వర రావు, తోట అంబిక తదితరులు ఉన్నారు.

యోగాతో దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం



నకరికల్లు: యోగాతో దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం లభిస్తుందని యోగా గురువు బ్రహ్మయ్య తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక కల్యాణ మండపంలో ఉచిత యోగా తరగతులు శుక్రవారం నిర్వహించారు. మయూరాసనం, వృక్షాసనం, త్రికోణాసనం, శీర్షాసనం తదితర ఆసనాలు వేసి వాటి ప్రయోజనాలను వివరించారు. క్రమం తప్పని యోగాభ్యాసంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఆయన అన్నారు. యోగాసనాలతో పాటు ఆహారపు అలవాట్లు మార్చుకోవడం, జీవనశైలిలో క్రమశిక్షణ అలవర్చుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం లభిస్తుందన్నారు. నూతన అభ్యాసకులకు యోగాసనాలు వేసే సులభ పద్ధతులు, వాటి ప్రయోజనాలు వివరించారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

గురజాల రూరల్: రేషన్ సరుకులు ప్రతి నెల కార్డుదారులకు అందేలా చూడాలని తహసీల్దార్ కుటుంబరావు అన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలు, రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యావసరాలు ప్రజలకు అందేలా చూడాలని, సరుకులు సక్రమంగా అందింకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

- రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం యత్నం
- రేషనలైజేషన్ పేరుతో కుదింపుకు కుట్ర
- సిబ్బంది లేరు.. సేవలు లేవు
- గ్రామాలలో తాళాలతో దర్శనం



తాళ్లచెరువులో సిబ్బంది లేక మూతబడిన రైతు సేవా కేంద్రం

అచ్చంపేట: ఉన్న ఊరిలోనే రైతులకు మేలైన సేవలు అందించేందుకు, వ్యవసాయ సూచనలు, సలహాలు ఇచ్చేందుకు, పండించిన పంటలను కొనుగోలు చేసేందుకు, గిట్టుబాటు ధరలు కల్పించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాలను (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాలు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచాయి. గత ప్రభుత్వంలో రైతులకు వెన్నదన్నుగా నిలిచి ఎన్నో సేవలు అందించాయి. దీంతో రైతులకు వ్యయప్రయాసలు తప్పాయి. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్బీకేలకు రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. కాగా కూటమి ప్రభుత్వ తీరుతో త్వరలో ఇవి కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. రేషనలైజేషన్ పేరుతో వీటిని కుదించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఒకప్పుడు వచ్చిపోయే రైతులతో కళకళలాడిన రైతు భరోసా కేంద్రాలు ఇప్పుడు సిబ్బంది లేక వెలవెలబోతూ దాదాపు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయి.

నష్టాలతో గత సీజన్

గత వ్యవసాయ సీజన్ మొత్తం నష్టాలతోనే సాగింది. ఒక్క రైతు కూడా లబ్ధిపొందిన పాపాన పోలేదు. ఇన్‌పుట్ సబ్సిడీ లేదు.. గిట్టుబాటు ధర లేదు. పత్తి అధిక వర్షాలకు మొదట్లోనే కొట్టుకుపోయింది. పొగాకు పూర్తిగా దెబ్బతింది. మిర్చి తెగుళ్లతో దిగుబడి లేదు. కాస్తో కూస్తో పండిన పంటలను కొనుగోలు చేసే నాథుడే లేకపోవడంతో రైతులు దళారులను నమ్ముకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేలు

రైతులకు అన్ని రకాల సేవల అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో రైతు సేవా కేంద్రాలు.. పేరుకే సేవా కేంద్రాలుగా ఉన్నాయి తప్ప ఎటువంటి సేవలు అందడం లేదు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటల సాగుకు అవసరమైన అన్ని సేవలు అన్నదాతలకు సకాలంలో అందేవి. పంటల సాగులో సూచనలు, సలహాలతో పాటు విత్తనాలు, ఎరువులు అందించేవారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసేవారు. తద్వారా రైతులకు ఎంతో మేలు జరిగేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ వ్యవస్థనే నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతోంది. రేషనలైజేషన్ పేరుతో కేంద్రాలను కుదించేందుకు ప్రయత్నిస్తోంది.

తగ్గిపోనున్న రైతు సేవా కేంద్రాలు

కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. సాగుకు అవసరమైన రాయితీ విత్తనాల పంపిణీ ఆగిపోయింది. సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు నామమాత్రంగా ఇచ్చారు. ఎరువుల జాడేలేదు. గత ఏడాది కూడా రైతు సేవా కేంద్రాల ద్వారా కాకుండా సహకార సంఘాల ద్వారా ఎరువుల విక్రయాలను జరిగాయి. గత వ్యవసాయ సీజన్ చివరిలో యూరియా అందక రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. తాజాగా రేషనలైజేషన్ పేరుతో 2 వేల ఎకరాల సాగు ఉండే గ్రామాలలో మాత్రమే రైతు సేవా కేంద్రాలు కొనసాగించాలని నిర్ణయించి కుదింపుకు శ్రీకారం చుట్టారు. ఆ మేరకు నివేదికలు సిద్ధం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయితే మండలంలో రైతు సేవా కేంద్రాలు తగ్గిపోనున్నాయి.

- అచ్చంపేట మండలంలో 17 రైతు సేవా కేంద్రాలకు ఉండగా.. మూడు, నాల్గింటిని రద్దు చేసే ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఇందులో వీఏఏలుగా విధులు నిర్వహించే వారిలో సగం మందిని కుదించి మిగిలిన వారిని రేషనలైజేషన్ పేరుతో ఇతర శాఖలకు పంపించే అవకాశాలున్నాయి. మిగిలిన సిబ్బందికి రైతులకు సేవలు అందించడం కష్టంగా మారనుంది. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో రైతులు ఇబ్బందులు పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

పండగలా వ్యవసాయం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం పండగలా సాగింది. గ్రామాలలోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా విత్తనం నుంచి ఎరువుల వరకు అన్నీ లభించేవి. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి స్థానికంగానే కొనుగోలు చేసే వారు. రైతు భరోసా కేంద్రాలను కుదిస్తే వ్యవసాయం దండగ అనే భావన మళ్లీ కలుగుతుంది.

– మర్యాద వెంకటరెడ్డి, రైతు, కోగంటివారిపాలెం

మా ఊళ్లోనే సేవలు అందేవి



గతంలో రైతు భరోసా కేంద్రాల వల్ల ప్రయోజనం పొందాం. విత్తనాలు, ఎరువులు, సాగుకు అవసరమైన అన్ని సేవలు మా ఊళ్లోనే అందేవి. వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా అందుబాటులో ఉండి అధిక దిగుబడులు సాధించడానికి సూచనలు, సలహాలు ఇచ్చేవారు.

– సుంకర ప్రతాప్‌రెడ్డి, రైతు, కోగంటివారిపాలెం

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలి

విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్



రాజుపాలెం: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని మాచర్ల డివిజన్ విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మండలంలోని కొండమోడు విద్యుత్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఈ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం చేయకుండా విద్యుత్‌ను అందించాలని తెలిపారు. విద్యుత్ బిల్లుల వసూళ్లలో అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై గృహ వినియోగదారులకు అవగాహన కల్పించి, ఈ నెల 25వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. విద్యుత్ శాఖ సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని, వినియోగదారులకు అందుబాటులో ఉండాలని అన్నారు. 24 గంటలు విద్యుత్ సరఫరా అయ్యే విధంగా సిబ్బంది చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూతలపాటి సింగయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.నాగసురేష్‌బాబు, రాజుపాలెం ఏఈ కోట పెదమస్తాన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీ, విక్రయాలు మానుకోండి

ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్‌రెడ్డి



తాడువాయి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ రవికుమార్‌రెడ్డి

అచ్చంపేట: గ్రామాలలో, తండాలలో బట్టీలు పెట్టి నాటుసారా తయారు చేయడం, విక్రయించడం మానుకోవాలని, అలా మానుకున్న వారందరినీ ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని, రుణాలిచ్చి ప్రత్యామ్నాయ పనులు చేసుకునేందుకు ప్రోత్సహిస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.రవికుమార్‌డ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సూర్యనారాయణ సూచించారు. ఆల్టర్నేటివ్ లైవ్లీహుడ్ ప్రోగ్రామ్ కింద మండలంలోని సంద్రతండా, బంగారుతండా, తాడువాయి గ్రామాలలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. పాత ముద్దాయిలను పిలిపించి అవగాహన కల్పించారు. జీవనాధారం కోసం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామని కిరణా, ఫ్యాన్సీ లాంటి వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. నాటుసారా వలన కలిగే అనర్థాలను వివరించారు. అనుమానిత ప్రాంతాలలో నిరంతర నిఘా ఉంటుందన్నారు. అనంతరం క్రోసూరు, అచ్చంపేట మండలాల్లోని వైన్ షాపులను తనిఖీ చేశారు. టైమింగ్స్, ఎమ్మార్పీ బోర్డ్స్, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మద్యం విక్రయం లాంటి వాటిని పరిశీలించారు. అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు క్యాన్సిల్ చేసి, క్రిమినల్ కేసులు బనాయిస్తామని హెచ్చరించారు. వారి వెంట క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.తులసి, ఎస్ఐ శ్రీనివాస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీలో ఇరువురికి చోటు



రావెళ్ల శ్రీధర్



భూక్యా కృష్ణానాయక్

అచ్చంపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ కమిటీలో అచ్చంపేట మండలానికి చెందిన ఇరువురికి స్థానం కల్పిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా గ్రంధశిరి గ్రామానికి చెందిన రావెళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ సెక్రటరీగా తాడువాయి గ్రామానికి చెందిన భూక్యా కృష్ణానాయక్‌లు నియమితులయ్యారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయమని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పార్టీ పక్షాన పోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను, బడుగు బలహీన వర్గాలను ఎలా మోసం చేసిందో ప్రజలకు తెలియజేస్తామన్నారు. తమకు ఈ గుర్తింపు నిచ్చిన పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

డయేరియాపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు



స్టాప్ డయేరియా పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న ఆరోగ్య, పంచాయతీరాజ్ సిబ్బంది

అచ్చంపేట: వర్షాకాలం సీజన్ ప్రారంభంలో డయేరియా, అతిసార, నీళ్ల వీరేచనాలు వంటి వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్టాప్ డయేరియా పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం జూలై 31 వరకు ఉంటుందన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.ఇన్నారావు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 0–5 సంవత్సరాలలోపు పిల్లలు 4,389 మంది ఉన్నారని, వారందరికీ ముందస్తుగా ఒక్కొక్కరికి వారానికి రెండు చొప్పున ఓఆర్ఎస్ ప్యాకెట్స్, 14 జింక్ మాత్రలు పంపిణీ చేయనున్నామన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత మరుగుదొడ్లు వాడుకోవాలని, అతిసార లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు మాట్లాడుతూ వర్షాకాలంలో కలుషిత నీటి కారణంగా అతిసార వ్యాధి ప్రబలే అవకాశాలున్నాయని.. నివారణకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవో వెంకటేశ్వర్లు ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ హాల్‌లో ఐఏఎల్ వాల్ క్లాక్ ఆవిష్కరణ



సత్తెనపల్లి: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కమిటీ సత్తెనపల్లి బార్ అసోసియేషన్‌కు బహూకరించిన 'వాల్ క్లాక్'ను సత్తెనపల్లి బార్ అసోసియేషన్ హాల్‌లో సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, మొదటి అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఇందిరా ప్రియదర్శిని, రెండవ అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) జె.సుజన్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్ కుమార్, ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సత్తెనపల్లి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నరిశేటి వేణుగోపాల్, పలువురు సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

ఇరువురి మధ్య ఘర్షణ.. ఒకరికి తీవ్ర గాయాలు

సత్తెనపల్లి: ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణంలోని ప్రాంతీయ పశు వైద్యశాల సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన గొలసం రాంబాబు ఇంటిలో బారసాల శుభకార్యం సందర్భంగా వెల్దుర్తి మండలం గంగలకుంటకు చెందిన బంధువులు శుక్రవారం వచ్చారు. వారి వాహనం వెనుకకు రివర్స్ చేసే క్రమంలో పట్టణానికి చెందిన షేక్ నజీర్ ద్విచక్ర వాహనానికి తగలడంతో.. నజీర్‌కు వాహనం రివర్స్ చేసిన గొలసం శ్రీకృష్ణకు మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో నజీర్ బ్యాట్‌తో దాడి చేయగా శ్రీకృష్ణ తలకు తీవ్ర గాయాలు కావడంతో క్షతగాత్రుడిని ఏరియా వైద్యశాలకు తరలించారు.

విజయపురిసౌత్ ఎస్ఐగా అశోక్ కుమార్



విజయపురిసౌత్: విజయపురిసౌత్ ఎస్ఐగా డి.అశోక్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వచ్చారు. ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతానని హెచ్చరించారు.

మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న అనంతలక్ష్మి, ఏడుకొండలు, బుల్లిబాబు, తదితరులు

సత్తెనపల్లి: మానవ మనుగడకు ప్రాణవాయువైన ఆక్సిజన్ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి అన్నారు. సత్తెనపల్లి మండలం వావిలాలనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌లో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృభూమి పరిరక్షణకై ఒక మొక్క నాటుదాం అనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ ఒక్కో మనిషి కనీసం 50 మొక్కలు నాటినా భూ మండలంపై ఎక్కడ చూసినా పచ్చని చెట్లు కళకళలాడతాయన్నారు. ప్రధానోపాధ్యాయుడు కుంభ ఏడుకొండలు మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు మన తల్లి ఏ విధంగా పెంచిందో అదే విధంగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ మనిషి జీవితంలో మొక్కలు అనేక విధాలుగా ఉపయోగపడతున్నాయన్నారు. మొక్కలు మానవ మనుగడలో భాగమన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు అక్షయ్, అంగన్‌వాడీ కార్యకర్తలు దమయంతి, యోగేశ్వరి, ఆయాలు, చిన్నారులు, పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

అమరావతి: మండల పరిధిలోని ఉంగుటూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అమరావతి కో లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్ హాజరై ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ గురించి ఎంపీపీ ఎల్ఈ, ఎంపీయూపీ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరిధర్ మాట్లాడుతూ ఫ్లోరోసిస్ ఏ విధంగా వ్యాపిస్తుందో, దానిని ఎలా నివారించాలో తెలియజేశారు. ముఖ్యంగా బోర్ వెల్ నీరు, పొగాకు సంబంధిత వస్తువులు, పానీపూరి, కుర్ కురే వంటి వాటిని తినడం.. ప్రధానంగా అందులో కలిపే బ్లాక్ సాల్ట్ వల్ల ఈ వ్యాధి సక్రమించే అవకాశం ఉందన్నారు. అలాగే బ్లాక్ టీ వంటివి మితిమీరి ఉపయోగిస్తే ప్రజలు త్వరగా ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడతారన్నారు. ఈ సందర్భంగా 3, 4, 5 తరగతుల పిల్లలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే కమ్యూనిటీ సర్వే కూడా గ్రామంలో నిర్వహించాలని సూచించారు. ఈ వ్యాధి నివారణకు రక్షిత తాగు నీరు, కాల్షియం, విటమిన్ సీ, ఈ పోషకాలు అధికంగా ఉన్న కూరలు, పండ్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఒ.లక్ష్మీమనోహర్, సీహెచ్‌వో సంధ్యా రాణి, సిబ్బంది ఆశా కుమారి, ఎ.కోటేశ్వరరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని శాఖలకు రెవెన్యూ శాఖ ఆదర్శవంతం



రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దారు నాగేశ్వరరావును సత్కరిస్తున్న తహసీల్దారు దుర్గేష్‌రావు

రాజుపాలెం: ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైనదని ప్రతి రెవెన్యూ ఉద్యోగి రోజురోజుకు విజ్ఞానాన్ని పెంపొందించుకుని విధులు నిర్వహిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయని తహసీల్దారు దుర్గేష్‌రావు తెలిపారు. మండల తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని అధికారులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ పురాతన కాలంలో ఏర్పాటు చేయబడి నేటికీ కొనసాగుతున్న సుసంపన్నమైన శాఖ రెవెన్యూ శాఖ అని కొనియాడారు. పారదర్శకమైన జవాబుదారీ పరిపాలనను అందించడంలో రెవెన్యూ శాఖ తోడ్పడుతుందని తెలిపారు. రెవెన్యూ శాఖ ప్రతి శాఖకు ఆదర్శవంతంగా ఉంటుందని చెప్పారు. అనంతరం సిబ్బంది, రెవెన్యూ అధికారులు ప్రతిజ్ఞ నిర్వహించారు. రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహసీల్దారుగా చేసి పదవీ విరమణ చేసిన రాజుపాలెంకు చెందిన పొత్తూరి నాగేశ్వరరావును, ప్రస్తుత తహసీల్దారు దుర్గేష్‌రావును అధికారులు, ప్రజా ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో–1 మల్లిఖార్జునశర్మ, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నిత్యశ్రీకి ఘన సత్కారం



నిత్యశ్రీని సత్కరిస్తున్న న్యాయవాదులు, మదర్‌థెరిస్సా సేవాసమితి సభ్యులు

మాచర్ల: ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకుడు సి.హెచ్.నాగిరెడ్డి మనుమరాలు నిత్యశ్రీ నీట్‌లో ఆల్ ఇండియా 4,500, ఈడబ్ల్యూఎస్‌లో 401వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటింది. శుక్రవారం న్యాయవాది నాగిరెడ్డి కార్యాలయంలో మదర్‌థెరిస్సా సేవాసమితి సభ్యులు నిత్యశ్రీ, ఆమె తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. మాచర్ల మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన చిలమకూరి శ్రీనివాసరెడ్డి, పద్మావతిల కుమార్తె నిత్యశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు గాదే కిరీటిరెడ్డి, అందుగుల చంద్రయ్య, భాస్కర్ రెడ్డి, చిన్నపరెడ్డి శాంతి రెడ్డి, జిల్లాపరిషత్ ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి, పార్వతి, న్యాయవాది అందుగుల జోజి, కాలేజీ ప్రిన్సిపాల్ కుర్రి సాయి కొండారెడ్డి, న్యాయవాది గట్ల సత్యనారాయణ రెడ్డి, గుంజా ప్రసాద్ పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి



యోగాసనాలు చేస్తున్న దృశ్యం

మాచర్ల, మాచర్ల రూరల్: ప్రజలకు యోగాపై అవగాహన కల్పించి నెల రోజుల పాటు శిక్షణనిచ్చిన రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యోగా ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని గోవిందరెడ్డిని ఘనంగా సన్మానించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్‌కేబీఆర్ కళాశాల ఆవరణలో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, ఇతర శాఖల అధికారులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో హేమలత పాల్గొన్నారు.

యోగాతో రుగ్మతలు దూరం

విజయపురిసౌత్: నిత్య జీవితంలో యోగా చేయటం ద్వారా అనేక రుగ్మతలను దూరం చేయవచ్చని మాచర్ల వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ధ్యానం చేయటం అలవాటు చేసుకుంటే ఏకాగ్రతతో అనుకున్నది సాధిస్తారన్నారు. ఆధునిక సమాజంలో మనిషి ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని కూడా జయించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నయింబాను పాల్గొన్నారు.